జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట

13 ఆదివారం, సెప్టెంబర్ 2026 పేజీలు:11










02లో

**లోక్ అదాలత్‌లో 3,200 కేసులకు పరిష్కారం**




**మహమ్మదాబాద్ సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి )**

మండలం లోని పలు గ్రామాల్లో విగ్నేశ్వరుడి ఉత్సవాల సందడి మొదలైంది. యువత మొత్తం లంభోదరుడి మండపాల ముస్తాబులో నిమగ్నమాయ్యారు.ఉత్సవాల ఉత్సాహం ఎంత ముఖ్యమో భక్తుల భద్రత అంతే ముఖ్యం, ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సంతోషకర వాతావరణం క్షణాల్లో ప్రమాద కరంగా మారే అవకాశం ఉంటుంది ఈ నేపథ్యంలో మండపాల నిర్వాహకులు పాటించాల్సిన జాగ్రత్త ల పై ప్రత్యేక కథనం మండపాల నిర్మాణం రోడ్డు పైన  వాహన దారులకు ఇబ్బంది కలిగించే విధంగా ఉండరాదు.మండపాల నిర్మాణం పోలీసు వారి అనుమతులతో నిర్మించి వారికి శాంతి భద్రతల లధ్యష్ట్యా  సహకరించాలి. మండపానికి అమర్చే విద్యుత్ వైర్లు నాసిరకం,మన్నిక లేని స్విచ్ లు బోర్డు లు అమర్చారాదు .మండపం దగ్గర ప్రతి రోజు ఇద్దరు లేదా ముగ్గురు వాలంటీర్లు ఉండేలా చూసుకోవాలి. మండపాల వద్ద చెవులు బద్దలయ్యే విధంగా డీజే బాక్స్ లు అమర్చ రాదు దాని వల్ల చిన్న పిల్లలకు వృద్దులకు ఇబ్బంది కలగవచ్చు .ప్రతి రోజు మండపాల వద్ద భజన తో పాటుచిన్న పిల్లలతో భక్తి కీ సంబందించన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే విధంగా చూసుకోవాలని, మండలం లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసు వారికి సహకరించాలని మండల  అధికారులతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు మండలం లోని అన్ని గ్రామాల గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు తెలియచేస్తున్నారు.

మొదటిపేజీ తరువాయి

# లోక్ అదాలత్‌లో 3,200 కేసులకు పరిష్కారం

## - సైబర్ బాధితులకు రూ.56.65 లక్షలకు పైగా నగదు రికవరీ

## - పోలీసు--న్యాయశాఖ సమన్వయంతో వేగవంతమైన పరిష్కారం

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 12 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

జాతీయ లోక్ అదాలత్ ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాలో భారీ సంఖ్యలో కేసులకు పరిష్కారం లభించింది. జిల్లా పోలీసు శాఖ, న్యాయశాఖ సమన్వయంతో మొత్తం 3,200 కేసులు పరిష్కరించగా, సైబర్ నేరాల బాధితులకు రూ.56,65,935 నగదును తిరిగి ఇప్పించారు. జిల్లా వ్యాప్తంగా పరిష్కరించిన కేసుల్లో 432 ఎఫ్ఐఆర్ కేసులు, 752 డిడి కేసులు, 1,988 ఈ పెట్టీ కేసులు, 57 సైబర్ క్రైమ్ కేసులు ఉన్నాయి. ముఖ్యంగా సైబర్ నేరాల్లో మోసపోయిన బాధితులకు నగదు తిరిగి ఇప్పించడం ద్వారా వారికి కొంత ఊరట కల్పించారు. కేసుల పరిష్కారంలో కోర్టు డ్యూటీ అధికారులు, దర్యాప్తు అధికారులు, పోలీసు సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు సమన్వయంతో పనిచేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ దరావత్ జానకి కేసుల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపిన కోర్టు డ్యూటీ అధికారులు, దర్యాప్తు అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది, ఇతర సంబంధిత అధికారులను అభినందించారు. ఇదే సమన్వయం, అంకితభావంతో భవిష్యత్తులోనూ పనిచేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని సూచించారు.లోక్ అదాలత్ ప్రజలకు న్యాయం అందించే సమర్థవంతమైన వేదిక అని ఎస్పీ పేర్కొన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి పోలీసు శాఖ తరపున న్యాయశాఖకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.



# గూడెం అగ్నిప్రమాద బాధితులకు ఉపాధ్యాయులు చేయూత

## - బాధిత కుటుంబానికి వంట సామగ్రి.. రూ.10 వేల ఆర్థిక సాయం

**చిన్నంబావి,సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి)**

అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన విద్యార్థి కుటుంబానికి బెక్కెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అండగా నిలిచారు. చిన్నంబావి మండలం గూడెం గ్రామానికి చెందిన రోడ్డ బిచ్చన్న ఇంట్లో ఇటీవల షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇల్లు, ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాదంలో బిచ్చన్న తీవ్రంగా గాయపడటంతో వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విద్యార్థులు చదువుకునే పాఠ్యపుస్తకాలు సైతం అగ్నికి ఆహుతయ్యాయి.బిచ్చన్న మనవళ్లు బెక్కెం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు వెంటనే స్పందించారు. బాధిత కుటుంబానికి హెచ్ఎం విజయ వర్ధిని ఆధ్వర్యంలో స్కూల్ సిబ్బందితో కలిసి వంట సామగ్రి అందించి ఆపదలో అండగా నిలిచారు. ఉపాధ్యాయుడు జి. రవి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలిచిన పాఠశాల ఉపాధ్యాయులు, జి. రవికి స్కూల్ సిబ్బందికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాళ్లు అనిత, రాధమ్మ, రవి, సంజీవ్, స్వామి తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి తమవంతు సహకారం అందించారు. ఆపదలో ఉన్న విద్యార్థి కుటుంబానికి చేయూతనిచ్చిన పాఠశాల సిబ్బందిని పలువురు అభినందించారు.



# కులాంతర వివాహానికి ప్రతీకారమా? దళితుడి ఇల్లు నేలమట్టం"

- జిల్లా కలెక్టర్,ఎస్పీ, ఆర్డిఓ,ఎమ్మార్వో ఈ సంఘటనపై ఎందుకు విచారణ చేయలేకపోతున్నారు
- దళితులంటే ఎందుకు అంత చిన్న చూపు
- తక్షణమే జిల్లా కలెక్టర్ ఎస్పీ ఆర్డీవో ఎంఆర్ఓ గ్రామాన్ని సందర్శించి తగిన ఆధారాలు సేకరించి ఈ సంఘటనపై జరిగిన
-వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ మానవ హక్కుల సంఘం అధ్యక్షులు డిమాండ్

**గద్వాల (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 12:**

దళితుల ఇల్లు కూల్చివేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి. డి బి ఎఫ్,హెచ్ఆర్ఎఫ్,ఏ ఎస్ ఏ,నిజ నిర్ధారణ బృందం డిమాండ్. గద్వాల జిల్లా గద్వాల మండలం రేపల్లె గ్రామానికి చెందిన దళితుడైన రంగముని ఇంటికి కూల్చివేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ మానవ హక్కుల వేదిక అంబేద్కర్ విద్యార్థి సంఘం నిజ నిర్ధారణ బృందం డిమాండ్ చేసింది.శనివారం నాడు డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ ఆధ్వర్యంలో మానవ హక్కుల వేదిక కార్యకర్త సంజీవ్, అంబేద్కర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి,హైకోర్టు న్యాయవాది ఎద్దు దివాకర్,సామాజిక కార్యకర్త భాస్కర్ లతో కలిసి రేపల్లె గ్రామాన్ని సందర్శించి దళితుల కూల్చివేత ను పరిశీలించారు.బాధిత కుటుంబంతో గ్రామస్తులతో మాట్లాడి సంఘటన సంబంధించిన వివరాలను సేకరించారు.ఈ సందర్భంగా డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్ మాట్లాడుతూ, దళిత యువకుడైన రంగముని ఇదే గ్రామానికి చెందిన బోయ కులానికి చెందిన మహేశ్వరి ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నారు.హైదరాబాదులో పోలీసులను కలిసి తాము పెళ్లి చేసు కొన్నామని రక్షణ కల్పించాలని కోరారు. ఇరు కుటుంబాలను పోలీసులు పిలిసి కౌన్సిలింగ్ ఇచ్చారు. మేజర్ అయిన మహేశ్వరి తాను ప్రేమించి కులాంతర్యం తీసుకున్న రంగమునితోజీవిస్తానని తేల్చి చెప్పింది.దీంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు దళితుడైన రంగముని ఇంటిని గడ్డపారలు,ట్రాక్టర్ తదితర వస్తువులతో , వాహనాలు తో కూల్చి వేశారు.కాయకష్టం చేసి దళితులు కట్టుకున్న ఇల్లును నేలమట్టం చేశారు.ఈ ఘటనలో పాల్గొన్ననిందితులందరినీ తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం ఇల్లు కూల్చివేసిన వేసిన నిందితుల నుండి నష్టపరిహారాన్ని జరిమాన రూపంలో వసూలు చేసి తిరిగి దళితుల ఇల్లు నిర్మించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం నిందితులను గ్రామానికి దూరంగా ఉంచాలని డిమాండ్ చేశారు. సంఘటన





కేవలం బోయలు చేసింది మాత్రమే కాదని దీని వెనుక ఆధిపత్య రెడ్డి వర్గం,సర్పంచ్ ప్రోత్సహించినట్లు వివరించారు.వారిని సైతం గుర్తించి చర్యలు తీసుకోవాలని వెంటనే జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ గ్రామాన్ని సందర్శించాలని డిమాండ్ చేశారు.

## ఓట్లప్పుడు రాజకీయ నాయకులకు దళితులు అవసరం,దళితులు కష్టాల్లో ఉన్నప్పుడు నాయకులకు ఎందుకు కనిపించరు?

- ప్రేమ పెళ్లి చేసుకున్న దళిత యువకుడి ఇల్లు కూల్చివేత
- ఇల్లు నేలమట్టమైనా.. రాజకీయ నాయకుల నోళ్లకు తాళాలా?
- దళితుడి కన్నీళ్లు రాజకీయాలకు కనిపించవా?

**గద్వాల (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 12:**

జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం రేపల్లె గ్రామంలో గురువారం జరిగిన ఘటన తీవ్ర కలకలం రేపింది.బీసీ వర్గానికి చెందిన యువతిని దళిత యువకుడు ప్రేమ వివాహం చేసుకున్న నేపథ్యంలో యువకుడి ఇంటిని కూల్చివేసిన ఘటన వాస్తవంగా చోటుచేసుకుంది. దీంతో బాధిత కుటుంబం తీవ్ర ఆవేదనలో మునిగిపోయింది.అయితే ఇంతటి ఘటన జరిగినప్పటికీ బాధిత దళిత కుటుంబానికి అండగా నిలిచే రాజకీయ నాయకులు ఎక్కడ? అంటూ గ్రామస్థులు,దళిత వర్గాల నుంచి ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

### ఓట్లు కావాలి.. కానీ దళితుడి కష్టం వద్దా?

ఎన్నికలు వచ్చినప్పుడు దళితుల ఓట్ల కోసం ఇళ్లకు వెళ్లే రాజకీయ నాయకులు. ఒక దళితుడి ఇల్లు కూల్చివేసి,కుటుంబం రోడ్డున పడినప్పుడు మాత్రం ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.దళితుల ఓట్లు మాత్రమే కావాలా? వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావాల్సిన బాధ్యత లేదా? ఒక దళిత కుటుంబానికి అన్యాయం జరిగితే రాజకీయ పార్టీల గొంతు ఎందుకు మూగబోతుంది? అంటూ పలువురు నిలదీస్తున్నారు.ప్రేమ వివాహం చేసుకున్నందుకు ఒక యువకుడి ఇల్లు కూల్చివేయబడితే.. అది కేవలం ఒక కుటుంబం సమస్యగా చూడకుండా సామాజిక న్యాయం,వ్యక్తిగత స్వేచ్ఛ,చట్టపరమైన హక్కుల కోణంలో చూడాల్సిన బాధ్యత రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులపై ఉంది.ఇంతటి ఘటన జరిగినా నాయకుల మౌనం దేనికి సంకేతం? దళితుల ఓట్ల కోసం మాత్రమే రాజకీయాలు.వారి బాధల కోసం మాత్రం మౌనమా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు మౌనం వీడి బాధిత కుటుంబం పక్షాన నిలబడాలని, వారు కోరుతున్నారు.

## మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆశీస్సులతో 19వ వార్డులో బోరు ఏర్పాటు

**ఆలంపూర్ సెప్టెంబర్.12(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

ఏఐసీసీ కార్యదర్శి చత్తీస్గడ్ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆశీస్సులతో 19వ వార్డులో బోరు ఏర్పాటు అలాగే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, 19వ వార్డు కౌన్సిలర్ మాస్టర్ షేక్షావల్లి ఆచారి ఆదేశాల మేరకు అయిజ మున్సిపాలిటీ 19వ వార్డులో ప్రజల అవసరాల కోసం నూతనంగా బోరు ఏర్పాటు చేయడం జరిగింది అదేవిధంగా ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న సంపత్ కుమార్ నాయకత్వానికి, మాస్టర్ షేక్షావల్లి ఆచారి చొరవకు 19వ వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు ప్రజల కోసం ప్రజల సమస్యల పరిష్కారం కోసం -- కాంగ్రెస్ ఎల్లప్పుడూ ముందుంటుంది ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షుడు డాన్ వీరన్న,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాంబశివుడు , మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ చాలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు



# ప్రేమ పెళ్లి చేసుకుంటే ఇల్లు కూల్చేస్తారా..?

## రేపల్లె ఘటనపై పూడూరు అంబేద్కర్ యువజన సంఘం మండిపాటు





**గద్వాల (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 12:**

కులాంతర వివాహం చేసుకున్న యువకుడి ఇంటిని కూల్చివేసిన ఘటనపై పూడూరు గ్రామ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు,గ్రామ పెద్దలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారంవారు జోగులాంబ గద్వాల జిల్లా రేపల్లె గ్రామానికి వెళ్లి ఘటనాస్థలాన్ని పరిశీలించి,బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇద్దరు మేజర్లు ఇష్టపడి వివాహం చేసుకోవడం నేరమా..? అందుకు ఒక కుటుంబం నిర్మించుకున్న ఇంటిని కూల్చివేయడం ఏ న్యాయం?"అని ప్రశ్నించారు.కులాంతర వివాహాల విషయంలో సమాజంలో ఇంకా కొనసాగుతున్న వివక్షపై వారు తీవ్ర విమర్శలు చేశారు.దేశంలో ఎన్నో కులాంతర వివాహాలు జరుగుతున్నాయి.పెద్ద కులాలకు చెందిన వారు ఇలాంటి విషయాల్లో ఆలోచించి కుటుంబాలను కాపాడుకుంటున్నారు. కానీ పేద,బలహీన వర్గాల కుటుంబాల్లో మాత్రం ఆవేశపూరిత నిర్ణయాలతో జీవితాలను నాశనం చేసుకోవడం బాధాకరం"అని వారు అన్నారు.కులం,ఆర్థిక స్థితి పేరుతో మనుషుల మధ్య వివక్ష చూపడం సమాజ అభివృద్ధికి ప్రమాదకరమని పేర్కొన్నారు.ఒక యువకుడు,యువతి తమ జీవిత భాగస్వామిని ఎంచుకున్నందుకు వారి కుటుంబంపై దాడులు చేయడం ఇంటిని ధ్వంసం చేయడం వంటి చర్యలను సమాజం తీవ్రంగా ఖండించాలని అన్నారు.ఘటనపై అధికారులు వెంటనే స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని,ఇంటి కూల్చివేతకు బాధ్యులెవరో పూర్తిస్థాయిలో విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.బాధిత కుటుంబానికి రక్షణ కల్పించడంతో పాటు, వారి ఇంటిని పునర్నిర్మించి న్యాయం చేయాలని కోరారు."కులం కంటే మనిషి జీవితం ముఖ్యం. ఆవేశం కంటే ఆలోచనే ముఖ్యం.ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా జిల్లా కలెక్టర్,ఎస్పీ,ఆర్డీవో అధికారులు,ప్రజాప్రతినిధులు, సామాజిక సంఘాలు చొరవ తీసుకోవాలి అని పూడూరు అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు, గ్రామ పెద్దలు తెలిపారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

## - దేవరకద్ర నియోజకవర్గ అధికారులతో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సమీక్ష

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 12 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ఓటర్ల జాబితాను దోషరహితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ--2026 ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. 76--దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని తహశీల్దార్లు, సహాయ ఓటరు నమోదు అధికారులు, పోలింగ్ కేంద్రాల స్థాయి అధికారులు, పర్యవేక్షకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పురోగతిని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాల పరిశీలనలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

### వ్యత్యాసాలపై వెంటనే నోటీసులు

ఓటర్ల జాబితాలో గుర్తించిన వ్యత్యాసాలు, అనుసంధానం కాని ఓట్లు, ఇతర మార్పులకు సంబంధించి అవసరమైన నోటీసులను సంబంధిత ఓటర్లకు వెంటనే అందజేయాలని పోలింగ్ కేంద్రాల స్థాయి అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి విచారణలను పారదర్శకంగా నిర్వహించి నివేదికలను సకాలంలో సమర్పించాలని సూచించారు.కొత్త ఓటర్ల నమోదుకు దరఖాస్తు--6, ఓటరు పేర్ల తొలగింపు లేదా అభ్యంతరాలకు దరఖాస్తు--7, వివరాల మార్పులు, సవరణలకు దరఖాస్తు--8 ద్వారా అందిన దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని తహశీల్దార్లను ఆదేశించారు.

### ప్రత్యేక ప్రచార దినాల దరఖాస్తులపై దృష్టి

సెప్టెంబర్ 12తో ప్రత్యేక ప్రచార దినాలు ముగిసిన నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నుంచి స్వీకరించిన దరఖాస్తులు, అభ్యర్థనలు, సవరణలకు సంబంధించిన వివరాలను అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించాలని అదనపు కలెక్టర్ సూచించారు.ప్రత్యేక ప్రచార దినాల్లో స్వీకరించిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, తదుపరి చర్యలు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చేపట్టాలని ఆదేశించారు.

### క్షేత్రస్థాయి పనులపై పర్యవేక్షణ తప్పనిసరి

పోలింగ్ కేంద్రాల స్థాయి అధికారుల పర్యవేక్షకులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అధికారులు నిర్వహించిన పనులను మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. ఓటర్ల వివరాల పరిశీలన, దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాల్లో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో అలసత్వం లేదా నిర్లక్ష్యం వహించే వారిపై నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ హెచ్చరించారు.



### 18 ఏళ్లు నిండిన యువత ఓటరు జాబితాను పరిశీలించాలి

18 ఏళ్లు నిండిన అర్హులైన యువతతో పాటు ప్రతి ఓటరూ తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని అదనపు కలెక్టర్ కోరారు. ఓటరు వివరాల్లో తప్పులు, మార్పులు ఉన్నట్లయితే సంబంధిత అధికారులు, ఎన్నికల సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు.కొత్త ఓటరు నమోదు, పేరు తొలగింపు లేదా వివరాల సవరణకు సంబంధించి దరఖాస్తు--6, దరఖాస్తు--7, దరఖాస్తు--8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తులు సమర్పించుకునే అవకాశం ఉందన్నారు. దోషరహితమైన, పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు అధికారులు, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ఓటర్లు కూడా తమ వివరాలను సరిచూసుకుని ఎన్నికల యంత్రాంగానికి సహకరించాలని అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ కోరారు.

# ఓటరు జాబితా సవరణలో లోపాలకు తావివ్వొద్దు

## - కౌకుంట్ల, సి.సి.కుంట, దేవరకద్రలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 12 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రత్యేక సమగ్ర సవరణ--2026లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార దినోత్సవాన్ని పురస్కరించుకుని కౌకుంట్ల, సి.సి.కుంట, దేవరకద్ర మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.కౌకుంట్ల మండలం పుట్టపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రం నంబర్ 156తో పాటు కౌకుంట్ల గ్రామంలోని 157, 158, 159, 160 పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. అనంతరం సి.సి.కుంట గ్రామంలోని 208, 209, 210, 211, 212, 213 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా చేపడుతున్న ఎన్నికల సంబంధిత కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు.దేవరకద్ర మండలం చిన్నరాజమూర్ గ్రామంలోని 133, 134 పోలింగ్ కేంద్రాలను కూడా సందర్శించిన అదనపు కలెక్టర్ అక్కడి ఏర్పాట్లు, ఓటర్లకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను పక్కాగా కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ప్రచార దినాన్ని సమర్థవంతంగా నిర్వహించి, అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని, అర్హులైన ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదయ్యేలా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత తహసీల్దార్లు, సహాయ ఓటరు నమోదు అధికారులు, డిప్యూటీ తహసీల్దార్లు, పోలింగ్ కేంద్రాల పర్యవేక్షకులు, బూత్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఓటరు జాబితా సవరణలో పొరపాట్లకు తావివ్వొద్దు

## - జడ్చర్లలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రచార దినోత్సవాల పరిశీలన

## - అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదయ్యేలా చర్యలు

**మహబూబ్ నగర్, సెప్టెంబర్ 12 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావివ్వకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని మహబూబ్‌నగర్ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్, 75--జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి జె.ఎల్.బి. హరిప్రియ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర సవరణ--2026లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార దినోత్సవ కార్యక్రమాలను శనివారం జడ్చర్ల మండలంలోని గంగాపూర్, గొల్లపల్లి గ్రామాల్లో ఆమె పరిశీలించారు. గంగాపూర్‌లోని 208, 209, 210, 211 పోలింగ్ కేంద్రాలతో పాటు గొల్లపల్లిలోని 121, 122, 123 పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నోటీసుల విచారణలు, ఓటర్ల వివరాల్లో వ్యత్యాసాలు, అనుసంధానం కాని ఓట్లకు సంబంధించిన పత్రాలు, రికార్డులను ఆమె పరిశీలించారు. ఆయా అంశాల పరిష్కారానికి అధికారులు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రత్యేక ప్రచార దినోత్సవ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితాలోని ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరుకు సంబంధించిన సమాచారం సక్రమంగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో తప్పులు చోటుచేసుకోకుండా క్షేత్రస్థాయిలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలు, సవరణలను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును కాపాడే విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా పనిచేయాలని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల తహశీల్దార్, సహాయ ఓటరు నమోదు అధికారి నర్సింగరావు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.



# సామాజిక న్యాయ తెలంగాణే లక్ష్యం

## - గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొంగళ్ల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో...

## - తెలంగాణ రక్షణ సేనలో చేరిన అయిజ ఏబీవీపీ ముఖ్యనాయకులు

## - టిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన టి.ఆర్.ఎస్ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత

**ఆలంపూర్ సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన పనిచేస్తుందని పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ మండలానికి చెందిన ఏబీవీపీ ముఖ్య నాయకులు తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొంగళ్ల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో అయిజకు చెందిన ఏబీవీపీ ముఖ్య నాయకులు వెంకటేష్, అభినయ్, జశ్వంత్, వేణుగౌడ్, వినయ్ కుమార్, శేఖర్ తదితరులు టి.ఆర్.ఎస్ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత సమక్షంలో తెలంగాణ రక్షణ సేనలో చేరారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా టి.ఆర్.ఎస్ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ. తెలంగాణలో సామాజిక న్యాయం సాధించడమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజల కోసం పనిచేయాలని సూచించారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని కోరారు.గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొంగళ్ల రంజిత్ కుమార్ మాట్లాడుతూ. యువత పెద్ద సంఖ్యలో పార్టీలోకి రావడం శుభపరిణామమన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీని నియోజకవర్గంలో మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గద్వాల నియోజకవర్గ సీనియర్ నాయకులు బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.



# అలంపూర్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ

**ఆలంపూర్ సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

అలంపూర్ కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవనీయులు ఆర్.వి.ఎస్.ఎస్. మిధున్ తేజ, జూనియర్ సివిల్ జడ్జి, అలంపూర్, ఏ పి పి కార్తిక్ రాజ్, అలంపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి. శ్రీనివాసులు, అలంపూర్ ఎస్ఐ, రాజోలి ఎస్ఐ, మానోపాడ్ ఎస్ఐ, ఉండవెల్లి ఎస్ఐలు, న్యాయవాదులు, పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.అలంపూర్ మండల న్యాయ సేవా కమిటీ ఎం ఎల్. ఎస్. సి .సిబ్బంది ఎస్. జహంగీర్ హుస్సేన్, సాయి తేజ, పరశురాం కార్యక్రమంలో పాల్గొని లోక్ అదాలత్ నిర్వహణలో సహకరించారు.ఈ జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 2,874 కేసులు పరిష్కారానికి పరిశీలించబడ్డాయి. కేసులను సత్వరంగా, సౌహార్దపూర్వకంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఒక సమర్థవంతమైన వేదిక అని న్యాయమూర్తి తెలిపారు. ప్రజలు కోర్టు వివాదాలను రాజీ ద్వారా పరిష్కరించుకొని సమయం, ఖర్చును ఆదా చేసుకోవాలని సూచించారు.



# వికలాంగురాలిపై దాడి వ్యక్తులపై 2016 చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలి : బాలీశ్వర్

**వంగూర్ సెప్టెంబర్12 (ప్రజా జ్యోతి)**



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండలం పరిధిలోని సర్వా రెడ్డి పల్లి ( కిష్టంపల్లి) గ్రామంలో వికలాంగురాలు అక్కి శ్యామల ( 35) మీద దాడి చేసిన వ్యక్తులపై వికలాంగుల రక్షణ చట్టం 2016 ప్రకారం కేసు నమోదు చేయాలని ఎన్.పి.ఆర్.డి. వికలాంగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులిజాల బాలీశ్వర్ శనివారం డిమాండ్ చేశారు. 2016 వికలాంగుల రక్షణ చట్టం ప్రకారం కాకుండా సాధారణ సెక్షన్లతో కేసులు నమోదు చేయటానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు తమకు సమాచారం ఉందని అన్నారు. ఇంటి పైకి దౌర్జన్యంగా వెళ్లి దాడి చేయడమే కాకుండా బాధితురాలిపై కేసు పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, శ్యామలను వేధింపులకు గురిచేస్తే, శ్యామలపై తప్పుడు కేసులు పెడితే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

**ఆలంపూర్ సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ రాష్ట్ర శాఖకు మేరకు 12-09-26 రోజు అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడం జరిగింది దీనిని ఖండిస్తూ శనివారం అయిజ మండల లో పోలీసులు ఏబీవీపీ కార్యకర్తల అయిన మమ్మల్ని అర్ధరాత్రి 1:30 నర గంటలకు ఇండ్ల కు వచ్చి భయాందోళన గురిచేస్తూ ముందస్తు అరెస్టు చేయడం జరిగింది ఏబీవీపీ అయిజ నగర కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్లాలనేటటువంటి లక్ష్యాన్ని ఏబీవీపీ ఎంచుకొని పిలుపునివ్వడం జరిగింది ఈ యొక్క పిలుపుని నేరుగార్చాలని ఉద్దేశంతో అర్ధరాత్రి సమయంలోనే ప్రభుత్వం విద్యార్థులను కార్యకర్తలను నాయకులను అరెస్ట్ చేయడం జరిగింది వారు అన్నారు మమ్మల్ని ఎంత అరెస్టు చేసినా కూడా విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఏబీవీపీ నిరంతరం పోరాడుతూనే ఉంటుంది.. అదేవిధంగా విద్యార్థులకు రావలసిన స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ లను విడుదల చేయకుండా బడుగు బలహీన పేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు చదువులకు ఫీజు రియంబర్స్మెంట్ రాక కళాశాలలో సర్టిఫికెట్స్ ఇవ్వకుండా ఎంతోమంది విద్యార్థుల జీవితాలు చదువును దూరం చేసుకునే పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో కనబడుతోంది.ఖబర్దార్ రేవంత్ రెడ్డి విద్యార్థుల యొక్క స్కాలర్షిప్ ఫీజు రీయంబర్స్మెంట్లను మరియు నిరుద్యోగులకు జాబ్ నోటిఫికేషన్లను విడుదల చేయకుంటే రాబోవు రోజుల్లో తీవ్ర ఉద్యమాలతో నీ ప్రభుత్వాన్ని గద్దతింపే రోజు వస్తుందని అయిజ గడ్డ నుంచి హెచ్చరిస్తున్నాం




# రాజకీయంగా అత్యున్నత పదవులు అధిరోహించాలి

- ఎమ్మెల్యే వంశీకృష్ణ జన్మదిన సందర్భంగా
- శ్రీ ఉమామహేశ్వర స్వామిని దర్శించుకున్న
- ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ అనురాధ

**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 12**

**(ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )**

రాజకీయంగా అత్యున్నత పదవులు అధిరోహించి, పేద ప్రజలకు సేవ చేయాలని సాహృదయంతో ప్రత్యేక పూజలు గావించినట్టు ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ అనురాధ స్పష్టం చేశారు. శనివారం అచ్చంపేట మండలం శ్రీశైలం ఉత్తర ద్వారా బాసిల్లుతున్న శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ జన్మదిన సందర్భంగా శ్రీ ఉమామహేశ్వర దేవస్థానంలో స్వామి వారిని దర్శించుకుని అభిషేకం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ సతీమణి డాక్టర్ అనురాధ భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్, మాధవరెడ్డి, పాలకవర్గం సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మహిళలు,భక్తులు, తదితరులు,పాల్గొన్నారు..





# రేవల్లీలో కాంగ్రెస్ ధర్నా

- దళితుల అవమానాన్ని సహించం
- ఫామ్‌హౌస్ 'శుద్ధి'పై కాంగ్రెస్ భగ్గు
- స్పీకర్‌పై వ్యాఖ్యలు, ఫామ్‌హౌస్ శుద్ధి ఘటనపై నిరసన

**రేవల్లి, సెప్టెంబరు 12 (ప్రజాజ్యోతి):**

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ, బీఆర్ఎస్ శ్రేణులు చేపట్టిన ఫామ్‌హౌస్ శుద్ధి కార్యక్రమాన్ని నిరసిస్తూ రేవల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. పీసీసీ, డీసీసీ, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ సుల్తాన్ అలీ అధ్యక్షతన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళితులు డప్పు కొట్టి నిరసన తెలిపిన ఘటనకు ప్రతిగా బీఆర్ఎస్ శ్రేణులు పసుపు నీటితో శుద్ధి చేయడం దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఉందని ఆరోపించారు. ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, దళితుల గౌరవాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, దళితులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పర్వతాలు, ఉపాధ్యక్షుడు బండారు శ్రీను, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాములు (స్వామి), మండల సర్పంచుల సంఘం అధ్యక్షురాలు బాదేపల్లి రేవతి సురేష్‌గౌడ్, బీసీ సెల్ అధ్యక్షుడు కురుమయ్య, కిసాన్ సెల్ అధ్యక్షుడు చిన్నారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు తిరుపతయ్య, సిరిమల్లేష్, సర్పంచులు రాజయ్య, అంజనమ్మ, శ్రీశైలం, రాజు, బాల్నాగయ్య, ఉపసర్పంచులు అశ్విని రామచందర్, సుకుమార్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాములు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా స్కాలర్స్ కళాశాల ఫ్రెషర్స్ డే

- స్వయంకృషి, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరాలి

**వనపర్తి, సెప్టెంబరు 12 (ప్రజాజ్యోతి):**

విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని స్వయంకృషి, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని స్కాలర్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు డా. పి. జగదీశ్వర్, డా. జి. వరప్రసాదరావు, డా. బి. నాగేశ్వరరెడ్డి, డా. సత్యనారాయణరెడ్డి సూచించారు. శనివారం వనపర్తిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన స్కాలర్స్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకల్లో వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చదువుతోపాటు వివిధ రంగాల్లో ప్రతిభ చాటుకుని భవిష్యత్తులో ఉన్నతాధికారులుగా ఎదిగి దేశానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సాంకేతికతను విద్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసానికి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 36 ఏళ్లుగా స్కాలర్స్ విద్యాసంస్థలు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నాయని యాజమాన్య సభ్యులు తెలిపారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సందేశాత్మక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన వారితోపాటు ఈఏపీ సెట్, జేఈఈ, జూనియర్ జెఈఈలో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను మెమెంటోలతో సన్మానించారు. పూర్వ విద్యార్థులకు సత్కారం స్కాలర్స్ కళాశాలలో చదివి వివిధ రంగాల్లో స్థిరపడిన గైనకాలజిస్ట్ డా. సుభద్ర, ప్రిన్సిపాల్ సుప్రజాత, అడ్వకేట్ ఆర్. జ్యోతిని సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు ఎ. శ్రీధర్, బి. మధుసూదన్ గుప్త, డా. నాయకంటి నరసింహాశర్మ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.




# నూతన మెడికల్ షాప్ ను ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమనాద్రి పోతురాజు

**ఇటిక్యాల,ఎర్రవల్లి మండలం (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 12:**

శనివారం ఎర్రవల్లి మండల కేంద్రంలో నూతన మెడికల్ షాప్ ఓపెనింగ్ కి మెడికల్ షాప్ యజమాన్యం ఆహ్వానం మేరకు హాజరై రిబ్బన్ కట్ చేసి మెడికల్ షాపును ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపిన ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సోమనాద్రి పోతురాజు అనంతరం షాప్ ప్రోపరేటర్ ఆత్మీయ సన్మానంతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సోమనాద్రి పోతురాజు, కొండేరు గ్రామ సర్పంచ్ వీరన్న,కాశపోగు బీచ్చుపల్లి,ఎర్రవల్లి గ్రామ సర్పంచ్ భర్త కృష్ణ సాగర్ మరియు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఏవీఆర్ గ్లోబల్ స్కూల్ విద్యార్థిని మోక్షిత ఎంపిక

**గండీడ్, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి):**

గండీడ్ మండల కేంద్రంలోని ఏవీఆర్ గ్లోబల్ స్కూల్కు చెందిన విద్యార్థిని మోక్షిత యోగాలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ప్రస్తుతం కరీంనగర్‌లో నిర్వహిస్తున్న యోగా క్రీడా పోటీల్లో ఆమె పాల్గొంటోంది. చిన్న వయసులోనే యోగాలో విశేష ప్రతిభను కనబరుస్తూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. క్రమశిక్షణ, ఏకాగ్రత, నిరంతర సాధనతో మోక్షిత ఈ స్థాయికి చేరుకోవడం అభినందనీయమని పాఠశాల ప్రిన్సిపాల్ అంజయ్య గౌడ్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక కావాలని పాఠశాల యాజమాన్యం ఆకాంక్షించింది. విద్యార్థినిని ప్రోత్సహించి, నిరంతరం శిక్షణ అందించిన యోగా ఉపాధ్యాయురాలు బాలమణిని, అలాగే మోక్షిత తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్య సభ్యులు వెంకట్రాములు, రమేష్, వెంకటస్వామి, అనిల్ కుమార్తో పాటు ఉపాధ్యాయులు మోక్షితకు శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, యోగా వంటి ఆరోగ్యకరమైన కార్యకలాపాల్లో పాల్గొని ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు.








# గర్భిణీలు పోషక ఆహారంపై శ్రద్ధ వహించాలి

**చిన్నంబావి,సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి)**

చిన్నంబావి మండలంలోని పెద్దమారూర్ గ్రామశీలోని అంగన్వాడీ కేంద్రంలో 'పోషణ మాసం కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీపీఓ శ్రీశైలం ఉపాధ్యాయురాలు షబానా మాట్లాడుతూ, గర్భిణులు మరియు బాలింతలు పోషకాహారం తీసుకోవడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అంగన్ వాడి టీచర్ గోవిందమ్మ ఈ సందర్భంగా మాట్లాడుతూ... గర్భిణులు, బాలింతలు ప్రతిరోజు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. శరీరానికి అవసరమైన శక్తి కోసం గోధుమలు, బియ్యం, రాగులు, జొన్నలు వంటి ధాన్యాలతో పాటు సరైన ప్రమాణంలో కొవ్వు పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. అలాగే శరీరంలోని కీలక వ్యవస్థలు క్రమబద్ధంగా పనిచేయడానికి చిక్కుళ్ళు, పప్పు ధాన్యాలు, మాంసం మరియు గుడ్లు ఎంతో దోహదపడతాయని వివరించారు. సరైన పోషకాహారంతోనే తల్లి, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్లు అరుణ, శోభ రాణి,సుజాత, మాధవి, అంగన్వాడి ఆయలు లతో పాటు పలువురు గర్భిణీ స్త్రీలు, బాలింతలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జడ్చర్లలో కాంగ్రెస్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం

## - క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలి:

## డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్

**మహబూబ్ నగర్, సెప్టెంబర్ 12 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

కాంగ్రెస్ పార్టీని గ్రామ, మండల, బూత్ స్థాయిల నుంచి మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉండాలని మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎ. సంజీవ్ ముదిరాజ్ పిలుపునిచ్చారు.మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం జడ్చర్లలోని చంద్ర గార్డెన్స్‌లో జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సి డబ్ల్యూ సీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీ చందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ సంస్థాగత నిర్మాణం, క్షేత్రస్థాయి కార్యక్రమాలు, రాబోయే రాజకీయ కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రతి బూత్‌లో పార్టీని బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తలను పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వాములను చేయాలని సూచించారు. గ్రామ, మండల, బూత్ స్థాయిల్లో పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేసి ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని అన్నారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ చేపట్టే కార్యక్రమాల్లో కింది స్థాయి కార్యకర్తల నుంచి జిల్లా స్థాయి నాయకుల వరకు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదులా కొత్వాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బెక్కరి అనిత, మధుసూదన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రబ్బానీ, ఎన్.పీ. వెంకటేష్, అశోక్ యాదవ్, జడ్చర్ల మార్కెట్ కమిటీ ఛైర్మన్ అల్వాల్ రెడ్డి, స్పోక్స్‌పర్సన్ నిత్యానంద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే డిసిసి కమిటీ నాయకులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



## సల్కర్‌పేట్‌లో సేవా కార్యక్రమాలకు శ్రీకారం

## మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

## నూతన మిల్క్ సెంటర్ ప్రారంభ

**గండిడ్, ప్రజాజ్యోతి:**

పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో సల్కర్‌పేట్ గ్రామంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ, నూతన మిల్క్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణహితంగా పండుగను జరుపుకోవాలని నిర్వాహకులు ప్రజలకు పిలుపునిచ్చారు. మట్టి విగ్రహాల వినియోగం వల్ల నీటి కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.అదేవిధంగా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మిల్క్ సెంటర్‌ను ప్రారంభించారు. దీంతో గ్రామ ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులు అందుబాటులోకి రావడంతో పాటు పాడి రైతులకు కూడా ప్రయోజనం కలుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఉపయోగపడే కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ హేమలత, ఉప సర్పంచ్ నవీన్, వార్డు సభ్యులు, బీజేపీ రాష్ట్ర నాయకులు శంకర్ నాయక్, మండల అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, ఎన్రూ అధ్యక్షులు అంజిలయ్య, వీూజ వెంకటేశం, జి. శ్రీనివాస్, మల్కన్న, కె. రాజు, జి. కృష్ణయ్య, జి. లక్ష్మయ్య, కె. పవన్, కె. నరేష్, జి. వెంకటయ్య, జి. రామలింగం, బి. రఘు, వంశీ, శేఖర్, గోపాల్, కిష్టారెడ్డి, వీరేష్ తదితరులు, గ్రామ యువకులు, ప్రజలు పాల్గొన్నారు.పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుడు.. ప్రజలకు నిత్య సేవగా మిల్క్ సెంటర్ అంటూ గ్రామస్థులు ఈ కార్యక్రమాల పట్ల హర్షం వ్యక్తం చేశారు.



# మురుగు ముప్పులో కాలనీ వాసులు..! దోమల బెడదతో జనం విలవిల... మురుగు నీట్టి తో తంటలు....

**మాగనూరు, సెప్టెంబర్12(ప్రజా జ్యోతి)**

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మురుగు నీటి సమస్యతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో మురుగు నీరు నిలిచిపోవడంతో దోమల బెడద విపరీతంగా పెరిగిందని, దీంతో నిత్యం కాలనివాసులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వర్షం కురిసిన సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని గ్రామస్తులు తెలిపారు. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో బయటికి రావాలన్నా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. మురుగు కాలువల సమస్యను వెంటనే పరిష్కరించి, దోమల నివారణతో పాటు దుర్వసన రాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు.అధికారులు స్పందించి మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్సీ కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.



# "మట్టి వినాయకుడు... పర్యావరణానికి వరప్రసాదుడు"

- మట్టి వినాయకుల తయారీలో గిరిజన గురుకుల విద్యార్థినుల ప్రతిభ

- పర్యావరణ పరిరక్షణకు ఎకో క్లబ్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 12 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల మహిళా విద్యార్థినులు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు. కళాశాల ఎకో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు స్వయంగా మట్టి వినాయక ప్రతిమలను తయారు చేసి తమ సృజనాత్మకతను చాటుకున్నారు. పర్యావరణానికి హాని కలిగించే పదార్థాలకు బదులుగా మట్టి విగ్రహాలను ఉపయోగించాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెహ్రూ యువజన కేంద్రం--మై భారత్ కన్వీనర్ కోట నాయక్, యూత్ ఐకాన్ రాజేంద్ర గౌడ్, అనిల్ హాజరయ్యారు. విద్యార్థినులు తయారు చేసిన మట్టి వినాయక ప్రతిమలను పరిశీలించి ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్ధ బహుమతులతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో యువత, విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. సంప్రదాయ పద్ధతుల్లో మట్టి వినాయకులను తయారు చేసి పర్యావరణహితమైన వినాయక చవితి నిర్వహణకు విద్యార్థినులు మంచి సందేశాన్ని అందించారని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# రాజీ మార్గమే రాజ మార్గం!

## - జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రమాకాంత్

## - నేటి లోక్ అదాలత్ లో 6,985 కేసులు పరిష్కారం

**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)**

రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డి. రమాకాంత్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్ మరియు చైర్మన్ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా భూ తగాదా కేసులు,రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులు,చెక్ బౌన్స్ కేసులు,కుటుంబ కేసులు,మోటార్ వాహనా ఆక్సిడెంట్ కేసులు,బ్యాంకు తదితర పెండింగ్ కేసులను పరిష్కరించుకోవచ్చని అన్నారు.రాజీ మార్గమే రాజమార్గమని,లోక్ అదాలత్ తో సత్వర న్యాయ పరిష్కారంతో అప్పీల్ లేని తీర్పును పొందడం తో పాటు డబ్బు ఆదా చేసుకోవచ్చని లోక్ అదాలత్ లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా ఇరువర్గాలు సంతోశంతో జీవించవచ్చున్నారు.అనంతరం పోక్సో కోర్ట్ స్పెషల్ జడ్జి నసీమ్ సుల్తానా మాట్లాడుతూ కక్షి దారులు పగలు ప్రతీకారాలు పెంచుకోకుండా ఇరువర్గాలు రాజీచేసుకోవడంవల్ల మానవసంబంధాలు బలపడతాయని అన్నారు.డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ నిహారిక మాట్లాడుతూ సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా కేసులు త్వరగా పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ గొప్ప అవకాశమని అన్నారు. నేటి లోక్ అదాలత్ ద్వారా లో జిల్లా వ్యాప్తంగా 6,985 కేసులు పరిష్కారం అయ్యాయని అన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ కు సంబంధించిన క్రాప్లోన్ ప్రీ లిటిగేషన్ కేసునుపరిష్కరించబడిందని కేసుకు సంబంధించిన అవార్డు కాపీని జిల్లా జడ్జి చేతుల మీదుగా రైతుకు అందజేసారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి గోపిక నాగ శ్రావ్య,సీనియర్ సివిల్ జడ్జి గోపిక, శృతి దూత ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికాంత్ రావు, సెక్రెటరీ పర్వత్ రెడ్డి,కక్షిదారులు,సీనియర్,జూనియర్ న్యాయవాదులు,పాత్రికేయులు పాల్గొన్నారు.





# క్రీడాకారులకు చందు ప్రోత్సాహం





**చిన్నంబావి, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)**

చిన్నంబావి మండల కేంద్రంలోని బెక్కెం గ్రామంలో నిర్వహిస్తున్న బీపీఎల్ ఎనిమిదో సీజన్‌లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎస్ఆర్‌బీ సన్‌రైజర్స్ జట్టుకు చింతకుంట మాజీ సర్పంచ్ కుమారుడు డి. చందు చేయూత అందించారు. జట్టు సభ్యుల సాధన కోసం అవసరమైన దుస్తులను ఆయన సమకూర్చారు. ఈ సందర్భంగా జట్టు కెప్టెన్ డి. మహేష్ ఆధ్వర్యంలో చందును ఘనంగా సన్మానించారు.అనంతరం డి. చందుతో కలిసి జట్టు సాధన దుస్తులను ఆవిష్కరించి, క్రీడాకారులకు అందజేశారు. క్రీడాకారులపై అభిమానంతో పాటు జట్టు విజయాన్ని ఆకాంక్షిస్తూ చందు అందించిన సహకారం తమలో నూతనోత్సాహాన్ని నింపిందని జట్టు సభ్యులు తెలిపారు. క్రీడలకు ప్రోత్సాహం అందిస్తున్న చందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, రానున్న పోటీల్లో సమష్టి కృషితో మెరుగైన ప్రదర్శన కనబరిచి జట్టుకు విజయాన్ని అందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జట్టు కెప్టెన్ డి. మహేష్, ఉపకెప్టెన్ డి. పవన్, వికెట్ కీపర్ జిక్కి విష్ణు, ఆల్‌రౌండర్ జగన్, శరత్, బన్నీ, నాగపురి రాములు తదితరులు పాల్గొన్నారు. జట్టు సభ్యులు చందు అందించిన సహకారాన్ని అభినందించారు.

## మిట్టదొడ్డిలో చీకటి పాలన

## వీధి దీపాల కోసం ప్రజల ఎదురుచూపులు

### నాలుగు నెలలుగా దీపాల్లేక అవస్థలు..

### విద్యుత్ స్తంభాలున్నా వెలుగులు కరువు

**ఆలంపూర్ సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం పరిధిలోని మిట్టదొడ్డి గ్రామంలో వీధి దీపాల ఏర్పాటు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికీ వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళల్లో ప్రధాన వీధులు చీకటిమయంగా మారుతున్నాయని తెలిపారు అదేవిధంగా గతనాలుగు నెలలు గడుస్తున్నా సమస్యకు పరిష్కారం చూపకపోవడంపై గ్రామ సర్పంచ్ తీరుపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు ఇప్పుడైనా.వీధి దీపాల ఏర్పాటు విషయంలో గ్రామ పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సమస్యను పలుమార్లు తెలియజేసినా తగిన చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు(చీకటి వీధుల్లో భయం.. బయటకు రావాలంటే జంకుతున్న ప్రజలు)రాత్రి వేళల్లో మహిళలు, వృద్ధులు, చిన్నారులు అత్యవసర పనుల కోసం బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్థులు చెబుతున్నారుచీకటి కారణంగా పాములు, తేళ్లు, ఇతర విషపురుగుల సంచారం ఉంటుందేమోనని ఆందోళన చెందుతున్నారు



## ఒంటరితనం చిదిమేసిన జీవితం..

## నిశ్శబ్దంగా నిష్క్రమించిన నరేందర్

### భార్య దూరం.. తల్లి మృతి.. నాలుగు గోడల మధ్య విషాదాంతం

### నాలుగు రోజుల తర్వాత వెలుగులోకి వచ్చిన మృతదేహం

**ఆలంపూర్ సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

ఒంటరితనం ఓ నిండు జీవితాన్ని చిదిమేసింది. ఆపదలో అండగా నిలిచే వారు లేక, అనారోగ్యంతో ఇంట్లోనే మృతి చెందిన వ్యక్తి మృతదేహం నాలుగు రోజుల తర్వాత వెలుగులోకి వచ్చింది. గద్వాల పట్టణానికి చెందిన తెలుగు నరేందర్ (38) విషాదాంతమిది.నరేందర్ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ సాధారణ జీవితం సాగించేవాడు.అయితే అనివార్య కారణాలతో భార్య దూరమై విడాకులు తీసుకోవాల్సి రావడం అతని మనసును తీవ్రంగా కలచివేసింది.తనకు అండగా ఉన్న తల్లి కూడా ఇటీవల మృతి చెందడంతో మరింత ఒంటరిగా మారాడు. 'నాకంటూ ఎవరూ లేరు' అనే భావనతో తీవ్ర నిరాశకు లోనై మద్యానికి బానిసయ్యాడని స్థానికులు తెలిపారు.అనారోగ్యంతో ఇంట్లోనే మృతి చెందినా.. విషయం వెంటనే ఎవరికీ తెలియలేదు. చివరి క్షణాల్లో కనీసం మంచినీళ్లు అందించే వారు కూడా లేకపోయారు. నాలుగు రోజుల తర్వాత మృతదేహం నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.సమాచారం అందుకున్న గద్వాల టౌన్ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఒకప్పుడు అందరిలాగే జీవించిన ఓ మనిషి.. చివరికి ఎవరికీ తెలియకుండా నిశ్శబ్దంగా నిష్క్రమించడం స్థానికులను కలచివేసింది. ఆర్థిక సాయం కంటే కొన్ని సందర్భాల్లో 'నేనున్నాను' అనే భరోసానే మనిషికి గొప్ప అండ. చుట్టూ ఉన్న ఒంటరి మనుషులను పలకరించి, వారి బాధను వినాల్సిన బాధ్యత సమాజంపై ఉందనే విషయాన్ని ఈ ఘటన గుర్తుచేస్తోంది.

